బ్యాంకి

బ్యాంకీలో డబ్బు వేసి, ఎవరికన్నా ఇవ్వాలిసివస్తే చెక్కు వ్రాసి ఇయ్యాలని నాకు ఎన్నాళ్ళబట్టో సరదా. చెక్కు వ్రాసి ఇస్తూ ఉంటారే వాళ్ళనుచూస్తే నాకు ఎంతో గౌరవం. చెక్కు వ్రాసేవాడికి బ్యాంకీలో ఎంతడబ్బు ఉందో ఎవ్వరికి తెలియదు కాని చాలా ఉండి ఉండాలే అనిపిస్తుంది సామాన్యుడైతే వాడికి బ్యాంకీలో వేయటానికి డబ్బు ఎక్కడినుంచి వస్తుంది! వచ్చింది కాస్తా తాలింపులకు సరిపోతుందిగాని.

కాబట్టి చెక్కు వ్రాశాడూ అంటే వాడిదగ్గర కాస్తో కూస్తో డబ్బుఉన్న దన్నమాటే! అదీగాక, బ్యాంకీతో వ్యవహారం ఉన్న మనిషి, చాలాజాగ్రత్తమనిషి అనీ, చాలా డబ్బు దాచిపెట్టి ఉంటాడనీ లోకం అభిప్రాయపడుతుంది.

కోటయ్యకొట్లో నేను బియ్యం తెచ్చుకొని నెలాఖరుకు లెఖఇస్తూవుంటాను అనుకోండి. ఆయనడబ్బు అడిగినపుడు చెక్కువ్రాసియిస్తే అతనికి నా యందు ఏర్పడే గౌరవం వేరు, రూపాయలు లెక్కపెట్టి ఇస్తే ఏర్పడే గౌరవం వేరు. ఎల్లాగయినా చెక్కుచెక్కే అనుకోండి. చేతిలో డబ్బుఉండను ఎవరైనావచ్చి అడుగుతారు. లేదని అనటం ఎంతఅసహ్యం? బ్యాంకిలో మనకుడబ్బుఉందీ అని ఒకపుకారు పుట్టిన తరువాత డబ్బులేనపుడు లేదని చెప్పనక్కరలేదు. దర్జాగా అనొచ్చు 'బ్యాంకిలోనుంచి తియ్యాలయ్యా! ఇవ్వాళ రేపూ

బ్యాంకీకి సెలవ. ఎల్లుండిరా ఇస్తాను' అని ఈలోపున ఎక్కడో పుట్టించితీసుకొచ్చి యియ్యనూవచ్చు. బ్యాంకి ఎకౌంటుగల ఎట్లని ప్యాస్ పుస్తకం చేత్తోపట్టుకుంటేచాలు, చూచినవాళ్ళకు మనయందు ఎంతైనా గౌరవం కలుగుతుంది. ఇంకా చాలా లాభాలున్నాయి. అందుకనే ఎట్లాగయినా సరే బ్యాంకీలో డబ్బువేయాలని బుద్ధిపుట్టింది.

అయితే ఎట్లాగ వేయటం ?

వచ్చిన ఇబ్బంది ఏమిటీ అంటే మనకు వచ్చేవి నెలకు యాభై రూపాయలు. ఖర్చు డెబ్బైరూపాయలు పైచిలుకు. ఫస్టుతారీఖు వచ్చేసరికి బియ్యపు వర్తకుడు. చిల్లరకొట్టు ఆసామి, పాలమనిషి పున్నాయ, నెయ్యిపోసిన సీతమ్మ, పనిచేసే మహాలక్ష్మి, చాకలి సుభాన్ అంతా వీధిఅరుగుమీద కూర్చుని ఉంటారు. వీళ్ళందరికి ఇయ్యాలె. ఇవికాక మా ఆవిడ నాయుడుగారి భార్యదగ్గర నాలుగు రూపాయలు, నాంచారమ్మ గారిదగ్గర నాలుగురూపాయలూ తెచ్చినచేబదుళ్ళు తీర్చాలె.

ఇవన్నీతీర్చి ఇంకామిగిలేదేమిటి ? బ్యాంకిలో వేసేదేమిటి! బడ్జెట్ బ్యాలెన్సు కాదాయె ? ఎప్పుడూ డిఫిసిట్ బడ్జెట్! ఎల్లాగ డబ్బుమిగిల్చి బ్యాంకులో వేయటమూ అని చాలా రోజులు తీవ్రంగా ఆలోచించాను.

చివరకు ఓ ఉపాయంతోచింది. ఏమిటంటే కొంత అప్పుజేసి అదే తీసికెళ్ళి బ్యాంకిలో వేద్దామని !

అప్పుడు కోటయ్య వచ్చి "ఏమండీ డబ్బు ఇప్పించారు కారు" అని అడిగితే "ఇస్తాను లేవయ్యా, ఏంతొందర?" అని విసుక్కుంటాను.

కోటయ్యకేం తెలుసు నాకు బ్యాంకిలో డబ్బుఉందని! మామూలు మనిషే అనుకొని ముఖంచిట్లించి, 'ఏమిటండీ ఇయ్యకపోతే ఎల్లాగండీ' అంటాడు. నాకుకోపం వచ్చేస్తుంది. 'ఏమయ్యోయి అంతకచ్చితంగా అడిగితే, నిలుచున్న పాటున ఇచ్చేస్తాను తెలుసునా? డబ్బులేక కాదు. బ్యాంకిలోనుంచి తెచ్చి ఇయ్యటానికి బద్ధకించిగాని' అని విసుక్కుని అతను చూస్తూ ఉండగానె డ్రాయరులో నుంచి చెక్కు బుక్ తీసి బరబరా వ్రాసి, అతని ముఖాన పారేస్తాను. షావుకారు ఏమౌతాడు? పిల్లి అయిపోతాడు. ఆరోజునుంచి నన్ను ఎక్కువగా గౌరవిస్తాడు ఇప్పటిలాగ కాక.

బట్టలకొట్లోకి వెళ్ళటం. మనకు కావలసిన బట్టలు తీసికోటం. తాక్న చెక్కువ్రాసి కౌంటరుమీద పారేయటం!

నేను ఇల్లాగ అక్కడకెళ్ళి చెక్కువ్రాసి ఇస్తాను ఇక్కడకెళ్ళి చెక్ వ్రాసి ఇస్తాను అని చెప్పటం అనవసరం ఊహించుకోవచ్చు. అయితే ఒకటేఇబ్బందివచ్చింది. దీనికి ఓ రెండు వందలురూపాయలు ఎవ్వరూ అప్పుఇయ్యలేదు కర్మం!

అప్పుకోసం తెగతిరిగాను. నేను అల్లాగ తిరుగుతూ ఉంటే ఓ మిత్రుడుచూసి ఒకసలహా చెప్పాడు. అప్పు సాహుకార్ల అడగవద్దనీ, వాళ్ళు ఎక్కువవడ్డీ తీసుకుంటారనీ, బ్యాంకీలో అయితే తక్కువ వడ్డీకే అప్పుదొరుకుతుందనీ,

అల్లాగయితే మరీనయం అక్కడే అప్పుతీసికొని, అక్కడే డిపాజిట్ చేసి నాకు కావలసినప్పుడు చెక్కు వ్రాసి తెచ్చుకోవచ్చును ఇతరులకు ఇవ్వాల్సినా చెక్కే ఇయ్యవచ్చు. ఈ పద్ధతి అన్నివిధాల బాగుంది.

సరే అల్లాగ చేద్దామని నిశ్చయించుకొని బ్యాంకికి వెళ్ళాను అదే నేను బ్యాంకికి మొదటిసారి వెళ్ళటం. కుర్చీలు, బల్లలూ, ఫాన్లూ, కిటకటాల వెనకాల గుమాస్తాలు, ఏదో అంతా గాభరగా ఉంది.

ఇంతలో ఎవరిని అడగాలె నాకు అప్పు కావాలని—ఎవరిని అడిగితే ఏమంటారో అని భయం.

అదృష్టవశాత్తు నాకు తెలిసిన సాహుకారొకాయన కనపడితే ఆయన్నడిగాను. రహస్యంగా ఆయన చెప్పాడు. బ్యాంకీవాళ్ళు అందరికీ అప్పు లియ్యరట! ఏం జెయ్యాలట అంటే 'ఈయన పెద్దమనిషి. ఈ అప్పు తప్పకుండా తీరుస్తారు' ఒక వేళ ఆయన తీర్చకపోతే నేను తీరుస్తాను అని హామీ ఉండగల మాంచి పెద్దమనిషిని తీసుకొచ్చి నేను బ్యాంకివారికి అప్పజెప్పాలట!

ఏడ్చినట్లుంది!

ఆ మాత్రం పరపతి ఉంటే, నేను ఆ పెద్దమనిషిదగ్గరే కావలసిన డబ్బు తీసుకొంటానుగాని ఈ బ్యాంకికి ఎందుకు వస్తాను.

అదీకాక,

నాకు ఓ రెండువందలరూపాయలు అప్పుఇయ్యటానికి భయపడి బ్యాంకే అనుమానిస్తే, ఇక ఊళ్ళో ఏ పెద్దమనిషి చూస్తూ, చూస్తూ నమ్మి నాకు హామీ ఉంటాడు. అప్పుపుచ్చుకోటానికి ఈపద్ధతి నాకు కుదరదు. ఇంకేమైనా ఉపాయం ఉంటే చెప్పు అన్నాను.

బంగారపు సొమ్ములు ఏమైనాఉంటే ఇస్తారూ అన్నాడు ఆయన. కొంచెం బాగానే ఉంది ఈ మాట! ఉండటంఅంటే ఎక్కడ ఉండాలె అని అడిగాను. బ్యాంకివారికి హామీగా చూపాలండీ అన్నాడు.

మా ఆవిడమెడలో ఏమీలేకపోయినా, మా ఇంటికి ఇటూ, అటూకూడా ఉన్నారు బోలెడుమంది సొమ్ముగల వాళ్ళు అపేమైనా చూపవచ్చులే. ఊరికే చూపటమేకదా అనుకొన్నాను. కాని అవి తీసుకొచ్చి బ్యాంకీవారికి ఇయ్యాలని చెప్పేసరికి నాకుకష్టంవేసింది. ఆసొమ్ము బ్యాంకీవారికి హామీగా దూరాన్నుంచి చూపగలను గాని తీసుకొచ్చి ఇయ్యటం ఎలాగు? ఇదినాకు ఏమాత్రం అనుకూలంగా లేదు. నిరుత్సాహంతో ఇంటికి వచ్చేశాను.

నా స్వంతసొమ్ము బ్యాంకీలో హామీగా ఇస్తే, ఏదో కొంతడబ్బు అప్పు ఇస్తారట! బ్యాంకివారికి ఇంతఆలోచన లేకపోవటం ఏమిటో! బంగారం కొనుక్కొనే శక్తివుంటే అప్పు అడగాల్సిన ఖర్మం ఎందుకు పడుతుంది అసలు!

ఇంతకూ బ్యాంకిలో డబ్బు వేయటమూ చెక్కులు వ్రాయటమూ అనే యోగ్యత నాకు లేదు.

రోజూ చూచేవాణ్ణి ఎంతోమంది బ్యాంకీమెట్లు ఎక్కటమూ దిగుతూ ఉండటమూను! ఒక్కొక్కరిచేతిలో కట్టలు కట్టలు నోట్లు ఉండేవి! ఏం, జేసుకు పుట్టారో వాళ్ళు అంత డబ్బు ఏట్లా దాచుకోగలిగాడు అని ఆశ్చర్యం కలుగుతూ ఉండేది!

కాని ఈ కోరిక చాలాబలమైనది అయింది. గుండెల్లో ఓ బరువుఅయింది. అదే కలవరింత అయింది. ఏమైనాకానీ, కొంతడబ్బు ఎల్లాగో అల్లా డిపాజిట్ చేసితీరాలని నిశ్చయించుకొన్నాను. ఎల్లాగ?

కొన్నిరోజులు ఆలోచించినమీదట ఒక ఉపాయం తోచింది. జీతం వచ్చినరోజున, డబ్బుతీసికొని, ఇంటికిరాకుండా అటునుంచి అటే బ్యాంకికి వెళ్ళటం జీతం, జీతం బ్యాంకీలో వేసెయ్యటం ఏమన్నా కానీ! అదినేను చేయదల్చుకొన్నపని!

అల్లాగచేస్తే, ఇంటికొచ్చిన తరువాత ఇవ్వవలసిన వాళ్ళంతా అడిగితే ఎట్లాగా అన్న విషయం నాకు తోచక పోలేదు. అడగనీ, అందరికీ చెక్కులువ్రాసి ముఖాన పారేద్దాము అనుకొన్నాను. చాలా దర్జాగా ఉంటుంది కూడా.

ఈ మాత్రం ఉపాయం తోచిందికదా అని సంతోషించి నెల ఆఖరుకై ఆతురతతో నిరీక్షించాను. ఫస్టుతారీఖు వచ్చింది. జీతంతీసుకొని బ్యాంకికి పరుగెత్తుకొని వెళ్లాను. బ్యాంకీలో కాలుపెట్టేసరికి భయంవేసింది వీళ్లు, ఓ యాభై

రూపాయలు వేయనిస్తారా అని. వెధవయాభై రూపాయలు తీసుకొచ్చావా బ్యాంకీలో వేయడానికి అంటారేమోనని భయం.

అదీకాక, ఎవరిని అడగాలో ఈ యాభై బ్యాంకీలో వెయ్యాలంటే !

అక్కడేమన్నా పెట్టెగిట్టె అలాంటిదిఉండి అందులో వెయ్యాలా ఉత్తరం పోస్టులో వేసినట్లు అని సందేహం కలిగింది. అల్లాగే వేస్తే నేను వేసినట్లు వాళ్ళకు తెలియటంఎల్లాగు? ఒకవేళ ఎవ్వరితోనైనా చెప్పాలేమో. ఇదిగో అబ్బాయి బ్యాంకిలో డబ్బువేస్తున్నాను చూడమని. ఇదంతా ఏదో గొడవగానేఉంది మొత్తంమీద !

ఇంకోభయముకూడాను. ఎవరినైనా అడిగితే ఏమంటారో గ్రహచారం! ఎట్లాగాబాబూ అనుకొన్నాను. ధైర్యం చేసి అడగలేక చూస్తూ నిలబడి ఊరుకొన్నాను. బ్యాంకి టైము అయిపోతుందేమోనని భయం.

అదృష్టవశాత్తు ఎవరో అబ్బాయి నా దగ్గరకువచ్చి ఏం కావాలండీ మాస్టారూ అన్నాడు. ప్రాణం లేచివచ్చింది. కాని ఆ కుఱ్ఱవాడితో చెబితే, వాడు వెళ్ళి, అందరితోనూ చెప్పి నన్ను అల్లరిపెడతాడేమో! అసలు యాభై రూపాయలు వెయ్యవచ్చునో వెయ్యకూడదో! ఈ రభసఅంతా వీడిదగ్గర ఎందుకు? అసలు ఏజంటుదగ్గరకే వెళ్ళి, ఆయన

తోనే, రహస్యంగా చెప్పి ఏసంగతీ గుట్టు చక్కగా తేల్చుకొని, పోదామని 'ఏజంటుగారిని చూడాలని' ఆ అబ్బాయితో అన్నాను.

ఆ చిన్నవాడు నన్ను వెంటబెట్టుకొని మేడపైకి తీసుకెళ్ళి, రెండు మూడు హాలులలోనించి నడిపించుకొని వెళ్ళి ఒక గదితలుపునెట్టి, నన్ను లోపలికి రమ్మన్నాడు. ఇన్ని గదులలోనుంచి రావటం అంతా ఎవరా ఈయన, ఏజెంటుతో ఏంపనిఉండి వెళ్ళుతున్నాడని యుగాదిగా చూడటం, కొంత మంది నవ్వుకోటం ఇవన్నీ చూచేసరికి నాకు కాస్త గాబరా వేసింది. ఏజంటుఅంటే ఇంత పై అధికారి అనుకోలేదు. ఏదో క్రిందే ఉంటాడేమో ననుకున్నాను. తీరా గదిలో ప్రవేశిస్తిని. ఏంచేసేది?...సరే ఏమన్నా కానీమని ఊరుకున్నాను.

ఆ ఏజంటు 'ఎవరయ్యా నీవు ఈ మాత్రానికి నాదగ్గరకు ఎందుకొచ్చావు వెళ్ళు' అని విసుక్కొని ఉన్నట్లయితే చాలం బాగుండేది. ఇంత కథ జరిగేది కాదు. ఆయనఅల్లాగ అనక, చిరునవ్వుతో ఆహ్వానించి కూర్చోమని కలంపుల్లతో ఓ కుర్చీచూపి ఏవో కాగితాలమీద సంతకాలుచేయటం సాగించాడు. కాసేపు నన్ను నా స్వంత ఆలోచనలకు వదిలేశాడు. ఇక నా ఆలోచనలు విపరీతంగా పోయినాయి. ఆయన నవ్వి హేళన చేస్తాడేమో అని ఒకటి.

పోనీ నవ్వనూ నవ్వడు, హేళనా చెయ్యడు అనుకొందాం. నీకు బ్యాంకిలో వేయటానికి యాభై రూపాయలు

ఎక్కడవీలంటే ఏం జెప్పాలె అని భయంవేసింది. నాస్వంతం అంటే నమ్ముతాడా? నీ జీతం ఎంతా అంటే, యాభైరూపాయలు అని చెప్పాల్సిందే కద! యాభైరూపాయల జీతగాడికి యాభైరూపాయలు వేయటానికి ఎట్లావచ్చినయ్యి అని అనుమానపడితే!

ఇక కాకపోతే, జీతం యావత్తూ వేస్తున్నానండీ అనాలె. ఇవ్వవలసిన వాళ్ళకు ఇచ్చావా అని అడిగితే! ఇయ్యలేదని చెప్పాలిసిందే గదా! చెపితే, సరే బాగానేవుంది, జీతంకాస్తా బ్యాంకిలోవేసి రేపటినుంచి నీ బాకీదార్లందరికీ చెక్కులిచ్చి మమ్ములను చంపుతావా అనికోప్పడుతాడేమో అసలు చేయదల్చుకొన్నపనే అదాయె. ఈ రహస్యం కాస్త ఆయన గ్రహిస్తే చిక్కులో పడిపోనూ!

ఆ యాభైనాకు అదనపు ఆదాయము, బ్యాంకిలో దాచుకొంటానికి వచ్చానని ఆయనకు నమ్మకం కలిగేలాగున చేయటానికి నేను ఏమి అబద్ధంఆడితే సరిపోతుందో నాకు తోచలేదు. ఇల్లాగ భయంకరమైన ఆలోచనలలోకి దిగాను.

పోనీ ఎందుకొచ్చినబాధ ఇదంతా వెళ్ళిపోదామని బుద్ధిపుట్టింది ఒకక్షణంలో. కాని ఎందుకొచ్చినట్లు, ఎందుకు వెళ్ళుతున్నట్లు! దానికి సమాధానం ఏం జెప్పను!

ఏమనిచెప్పి వెళ్ళిపోవాలె! ఆయన నాకు పరిచయుడన్నా అయితే ఏదోక్షేమసమాచారం అడిగివెళ్ళిపోవచ్చు. ఈయన పరిచయుడు కాకపోయె!

ఇంతలో ఆయన తనపని పూర్తిచేసుకొని నావంక చూశాడు, ఎందుకొచ్చానో చెప్పమన్నట్లు.

ఆయన కోప్పడేమనిషిలాగా లేదు. కాని నాకే గుండె దడ ఎక్కువైంది. నా బిక్కముఖంచూచీ, ఆయన 'చెప్పండి' అని హెచ్చరించాడు. అప్పుడు ఆయన ప్రక్కన ఒక ప్యూనూ, ఇంకెవరో ఓ ఆసామీ ఉన్నారు. ఇక్కడ నాకు ఎల్లాగూ చీవాట్లు తగిలేలాగానే ఉన్నాయి! వీళ్ళంతా ఎందుకువినటం అని అనుకొని మీతో ఓమాట చెప్పాలండీ అన్నాను వాళ్ళవంక అనుమానంగా చూస్తూ, భయంతో.

నాభయంచూచి ఆయనా భయపడ్డాడు. రజాకార్లు వచ్చి, ఆ బ్యాంకీని దోచుకోబోతున్నారని నాకు తెలిసి, ఆ వార్త రహస్యంగా చెపటానికి వచ్చానని ఆ ఏజెంటు అనుకున్నాకూడా ఆశ్చర్య పడవలసిన అవసరంలేదు. నా బిక్క ముఖం, వణుకుతూఉన్న గొంతుక అదరుతున్న పెదవులు. బెదురుచూపులు ఆయనను అల్లాగ చేయకపోతే ఆశ్చర్యం పడాలె నిజానికి!

ఆయన వెంటనే,అందరినిపొమ్మని చెప్పి 'ఏమిటండీ?' అని ఆదుర్దాగాఅడిగాడు. ఇక చెప్పకపోతే తప్పేటట్లులేదు. నా కుర్చీ ఆయనకు దగ్గరగా ఉండేలాగున కొంచెము ముందుకు లాక్కొని, అది కాదండీ, అంటూ ప్రారంభించాను. 'ఏది కాదు?' అన్నాడు ఏజెంటు వెంటనే! చచ్చాను. నాకున్న ధైర్యం కాస్తా చప్పబడి ఊరుకుంది మళ్ళీఅన్నాను 'అది

కాదండీ, క్షమించండి' అని. 'క్షమిస్తానయ్యా, తప్పక క్షమిస్తాను ఏమిటో చెప్పు చూపక అవతల నాకు చాలాపని ఉంది' అని ఆయన విసుక్కున్నాడు—'నేనూ,... యాభై రూపాయలూ... బ్యాంకీలో... వెయ్యాలని వచ్చాను...' అన్నాను ఎల్లాగో ధైర్యం తెచ్చుకొని ఆయన ఆ మాటలువిని, ముఖం చిట్లించి దీనికి ఇంత రహస్యమూ ఎందుకూ, అంటూ నన్ను రెక్కుచ్చుకొని కౌంటరు దగ్గరకు తీసుకెళ్ళి 'ఈయన యాభై రూపాయలు బ్యాంకీలో డిపాజిట్ చేస్తారట తీసుకో' అని పెద్దగా ఏదో తప్పుచేస్తున్నవాణ్ణి క్షమించమని చెప్పినట్లు చెప్పి వెళ్ళిపోయినాడు.

సరే, ఏంజేస్తాం, ఇంత అవస్థాచేతులారా తెచ్చిపెట్టుకొన్నానుగదాఅని అనుకొని ఆ యాభై రూపాయలూ ఆయన బల్లమీద పెట్టాను. ఆ గుమస్తా ఆడబ్బు మళ్ళీనాకు ఇచ్చివేశాడు వెంటనే!! ఆరిదీనిదుంపతెగ! అనుకొన్నంత పనీ అయ్యింది! వెధవరూపాయలు యాభైరూపాయలు బ్యాంకిలో వెయ్యటానికి వచ్చావూ!...చాల్లే! అని కోపంతో మళ్ళీ నాడబ్బు నాకు ఇచ్చేశాడు. 'అఁహ ఇక్కడ కాదు డబ్బు ఇయ్యాలిసింది. ఈ ఫారం పూర్తిచేసి అక్కడఇయ్యండి' అంటూ ఆయన ఇంకోగదివైపుకు చెయ్యి విసిరిన దాకా నాకు అసలు విషయం తెలియలేదు.

ఆయన చూపినగదిలోకి నేను వెళ్ళలేదు. అక్కడనుంచి ఇక్కడకూ, ఇక్కడనుంచి అక్కడకూ ఏమిటి యీ

తిరగటం! నేను తక్కువమొత్తం తేబట్టి గదా, బీదవాణ్ణి కాబట్టిగదా, నన్ను వీళ్ళు ఇల్లాగ ఏడిపిస్తున్నారని పుట్టెడు దుఃఖం వచ్చింది, కోపంకూడా వచ్చింది.

ఇంకా అక్కడ నేను క్షణం ఉండదల్చుకోలేదు. ఆయన ఇచ్చినకాగితం చేత్తోపట్టుకొని మెల్లగా బైటకి జారుతున్నాను.

ఇంతలో ఒక నౌకరువచ్చి అల్లాకాదు, ఇల్లారండి అని నన్ను ఆ గదిలోకి నడిపించుకొని పోయినాడు.

ఆ గదిలో షరాఫ్ కూర్చున్నాడు. నాచేత ఆ ఫారం పూర్తిచేయించాడు. ఆ కాయితంతీసుకొని, చెయ్యిచాచాడు, నేను, జీతం జీతిం, యాభైరూపాయలూ, ఆయన చేతిలో పెట్టాను. ఆయన తీసుకొని జాగ్రత్తగా లెక్కపెట్టుకొని, నేను చూస్తూఉండడంగానే ట్రేలోకి విసిరివేశాడు—నేను కష్టపడి సంపాదించిన డబ్బు ఆ మనిషి అల్లాగ నిర్లక్ష్యంగా విసిరి కొడుతూ ఉంటే నాకు ఎంతో కష్టం వేసింది.

నేను అక్కడేనుంచుని ఉన్నాను డబ్బు ముట్టినట్లు రసీదు ఏమైనా ఇస్తాడేమోనని. కాని ఆయన రసీదుఇయ్యక ఇక మీరు వెళ్ళవచ్చు. ప్యాసుబుక్కు వెనకనుంచి పంపిస్తాము అన్నాడు. చేతికొక కాయితంముక్కఅయినా రాకుండా యాభైరూపాయలు వెళ్ళిపోయినై! ఇప్పుడేమనుకుంటే ఏమి లాభం అనుకొని విచారంతో బైటికి వచ్చేశాను.

డబ్బు వేయటానికే ఇంతకర్మకాండ ఉంటే, మళ్ళీతీసు కోటానికి ఎంత ఉందో అన్నదిగులుకూడా పట్టుకొన్నది కాని అక్కడున్న గుమస్తా చెప్పాడు ఎప్పుడుబడితే అప్పుడు మళ్ళీ నా డబ్బు నేను తీసుకోవచ్చునని. సరేనని తృప్తిపడి మెట్లుదిగి వీధిలోకి వచ్చేశాను.

ఎట్లాగయితేనేం, ఓ యాభైరూపాయలు బ్యాంకిలో వేశాను. ఆ రోజే నా ఆర్థిక అభ్యుదయము ప్రారంభం అయిం దన్నమాట. గొడ్డుకుతిన్నదిబలం. మనిషికి ఉన్నదిబలం అంటారు. ఏదో ఓయాభైరూపాయలు నాకూ బ్యాంకిలో ఉన్నాయిగదా, అని నేనూ, సంతోషించాను.

నేను మెట్లుదిగిరావటం, ఇద్దరు ముగ్గురు స్నేహితులు చూచి కనుబొమ్మలెగరేశారు అంహ ఇంతవాడవు అయి నావూ అన్న అర్థంలో. ఇంతవాడవేమిటి ఇంకా ఎంతవాడను అవుతానో, నీకేం తెలుసు అన్న అర్థంలో నేనూ చూచాను.

నేను బ్యాంకి బయటికివచ్చి ఒక్కసారి బ్యాంకివంక గర్వంగా చూశాను. ఇవ్వాళ యాభై మాత్రమే ఉన్నా రేపు వందకాకూడదూ అనుకొని సంతోషంతో కాఫీహోటలు కెళ్ళాను ఒక కప్పు కాఫీ తాగుదామని! కాఫీతాగుతున్న పుడే చప్పున జ్ఞాపకంవచ్చింది, ఇంటిదగ్గర, ఈ పాటికల్లా అప్పులవాళ్ళు అంతా అరుగుపైన చేరి ఉంటారూ అని.

కాఫీ తాగేసి మళ్ళీ బ్యాంకికి వెళ్ళాను. ఎందుకంటే డబ్బువేసుకొనే సరదాతీరిందికదా, బ్యాంకిలోనుంచి డబ్బు

తీసుకోనే సగదాకూడా అప్పుడే తీర్చుకొంటాము దానికి ఇంకో సారి ఎందుకూ అని !

ఊతభా నాకేమీ భయం వేయలేదు. కోపిగా. నడిచి వెళ్ళి. డబ్బు తీసుకొంటానికి ఏం చెయ్యాలండీ అని ఒక గుమాస్తాను అడిగాను. మీ డిపాజిట్టువున్నదా అన్నాడు ఆయన 'ఆ, ఉన్నది' అన్నాను గర్వంగా. అయితే ఈ కాయితంమీద వ్రాయండి అని ఒక ఫారం పూర్తిచేసి ఆయనకు ఇచ్చాను. ఆయన ఒక పెద్దపుస్తకం తెరిచిచూచి తలఊపి 'ఇవ్వాళే యాభైరూపాయలు డిపాజిట్ చేశారు' అన్నాడు.

'అవును, అన్నాను గర్వంగా.

అతడు మళ్ళీ నేను ఇచ్చిన చెక్కుచూచి

'అయితే యాభై విత్‌డ్రా చేస్తున్నారా ?'

'ఆ' అన్నాను నేను స్థిరంగా.

ఆయన ఆశ్చర్యపడి నావేపు వింతగాచూ., 'కొంత ఉంచుకోరాదండీ' అన్నాడు. 'అహ ఉంచను' అన్నాను కోపంగా. ఎందుకోనాకు బ్యాంకిపైన చాలా కోపం వచ్చింది.

డిపాజిట్టు మొత్తం అంతా తీస్తారా ?

'ఆ'

ఏం ?

'నా ఇష్టం' అన్నాను మరీ కోపంగా. కోపంఏమిటి మండిపోయినాను. యాభైరూపాయలనేకాదు యాభైవేలు ఉన్నా తీసివేశేవాణ్ణి ఆ క్షణంలో. ఈ దరిద్రపు బ్యాంకిలో ఒకదమ్మిడీ అయినా ఉంచను అన్నట్లు చూశాను.

బ్యాంకిలో డిపాజిట్ చేసిన పావుగంటలో ఆ మొత్తం మొత్తం తీసివేసుకోటానికి తగినంత కారణం ఉండాలెకదా! 'పిచ్చివాడు' అని వాళ్ళు అనుకోకుండా ఉండాలంటే ఇంత కంటే మరో మార్గములేదు. నాకు బ్యాంకీపై చాలా కోపం వచ్చి, ఉన్నడబ్బుఅంతా తీసికెళ్ళుతున్నానని వాళ్ళు అనుకోవాలె అది నా ప్లాను! ఆ గుమస్తా నా వంక దీనంగా చూశాడు. ప్రతిమిలాడుతున్నట్లుగా 'అంతా తీసుకొంటారు టండీఅన్నాడు.

'తీసుకొంటానండీ అంతా తీసుకొంటాను ఒక్క డబ్బుడీ కూడా ఉంచను' అని సిక్కచ్చిగా నిర్మొహమాటంగా, చెప్పేశాను.

పాపం ఆ గుమాస్తా విచారంతో చెక్ ప్యాసుచేసి షరాఫు దగ్గరకు, పంపాడు. షరాఫు డబ్బుయిచ్చేశాడు. అందరూ ఆశ్చర్యపోయినారు. నేను డబ్బు జాగ్రత్తగా పర్సులో పెట్టుకొని బయటికి వచ్చేస్తున్నాను.

ఆ గుమాస్తాలలో ఒకడు, అప్పుడే అనుకొన్నాను 'ఇది డిపాజిట్ చేసేముఖం కాదని' అన్నట్లు నాకు తోచింది.

నీకు ఇప్పుడు తెలిసిందీ ఆ సంగతి! మా స్నేహితులంతా, చాలాకాలం క్రిందే అన్నారు ఆ మాట! అని వాడి తెలివి తేటలను గురించి హేళనగా అనుకొని, మెట్లుదిగి చకచకా ఇంటికి వెళ్ళిపోయినాను.